**అంధయుగం**

పేజి. 3

కౌరవ పాండవు లిద్దరూ
వారు వీరూ – ఇరుపక్షాలు
మర్యాదను మంటగలిపితే
అది కొన ఊపిరితో పడివుంది.
కకావికలుగా పడివుంది.

ఈ ఖండిత మర్యాదకు కారణం
కౌరవ పాండవులిద్దరూ –
కాకుంటే కౌరవులొక పాలెక్కువ

విలక్షణం ఈ సమరం
ఈ పోరాటంలో ఇరుపక్షాలు
పొందినలాభం ఏమిటి?
శూన్యం, శూన్యం.

మరి పొందిన నష్టం
అనంతం, అనంతం.

ఈ యుగసింహాసన
అధినేతలు అంధులు
అంధులు, అంధులు........

వివేకం మృగ్యమై
అంధత్వం జయించింది

భయోత్పాతమీ అంధత్వం
మమతావృతమీ అంధత్వం.
అంధత్వం జయించింది
అంధత్వం హసించింది.

సుందరమూ, శుభప్రదమూ
కోమలమూ లయించింది.
ఇది ద్వాపర యుగ సమాప్తి.

పద్ధెనిమిది రోజుల భీకర పోరాటం
చివరి రోజు, సంధ్యాసమయం.
నలువైపుల నిర్లిప్తత
కురురాజుల అంత:పుర వీధుల్లో
పారా తిరిగేరరుగో
రక్షక భటులిద్దరు
వయసు మళ్ళిన వృద్ధులు.

నిర్జన వీధుల్లో
పారా తిరిగేరరుగో –
రక్షక భటులిద్దరు.

పేజి. 7

కురక్షేత్ర రణం నుంచి
కబురేమి రాలేదు
గెలుపోటము లెవరివి
మిగిలిన కౌరవులెక్కడ?

అవిగో! ఆకలితో ఎగురుతున్న
నరభక్షక రాబందులు
ఏ మృత దేహం వాటి విందు?
ఏ శవమాహారం?

అంత:పుర మంతటా
అలుముకున్న నిశ్శబ్దం
చిక్కిచివికి పోతున్నది
గాంధారీ మాత.

దిక్కుతోచనట్లున్నది
తలవంచుకు కూర్చున్నది.
మహారాజు ధృతరాష్ట్రుడు
మౌనంగా ఉపవిష్టుడు.
సంజయుడింకా రాలేదు
ఏ కబురూ తేలేదు.

పేజి. 21, 22

ఇవాళో రేపో
ఇహ ఓటమి తప్పని ఈ నగరం
పద్ధతులన్నింటికి ఉద్వాసన చెబుతున్నది.

ఎటుచూసిన సంశయం
ఎటుచూసిన పరాజయం
ఒక్క పిడికెడన్నం కోసం
నిర్జన పురవీధుల్లో నిలబడి
అబద్ధాల భవిష్యత్తు
ననునిత్యం వల్లించే
ముసలియాచకుడి
దైన్యంలో ఈ సాయంకాలం.

రాజప్రాసాదం లోపల
ఆరుతున్న రెండగ్ని కణాలు.
మహారాజుల గుడ్డికళ్ళలో
మండే సన్నని ఆశ.

రాణిగాంధారి మండే గుండెలొ
మిణుకుమిణుకు మంటున్నది
ఎదో గుడ్డి ఆశ.

వరప్రసాది సంజయుడు
అమరుడు తటస్థుడు.

దివ్యదృష్టితో చూసినదంతా
గుడ్డిరాజుతో చెబుతాడు.
బ్రహ్మాస్త్రాలకు భయపడదు
సందేహాల్లేని వాడు, సంయముడు.

సంజయుణ్ణి సైతం ఇప్పుడు
మోహం కప్పేసింది
ఎక్కడో ఎక్కడో
ఏముళ్ళ బాటలో
తిరుగుతున్నాడో
ఎక్కడెక్కడ మసలుతున్నాడో
సంజయుడు
ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో!



శబ్దశిల్పి ఈ సంజయుడు
తటస్థుడైన సంజయుడు
గురుతరబాధ్యత ఒక పక్క
ద్వైదీభావం వేరొకపక్క
సంశయాత్ముడై సంజయుడు
ఏ ముళ్ళబాటలో తిరుగుతున్నాడో!!

అంధులు తన శ్రోతలు
అసంపూర్ణ మేమో భాష
ప్రతినిమిషం సంకటమె
అయినా నిజమే చెప్పిన
సంజయుడీనాడేమో
మోహాంధపు వలయంలోపడి
పయనిస్తున్నాడెక్కడికో –

పేజి. 39

వరద తీసినట్టి గంగ
చివికిన శవకలశాలను
ఒడ్డున వదిలేసినట్టు
కొత్త మలుపు తిరగాలని
అశ్వత్థామను
ఒడ్డున వదిలేసిందితిహాసం...

ఇది ఆత్మలు ఘోషించు రాత్రి -
దోవతప్పి శోకించే
                ఆత్మలు ఘోషించు రాత్రి
కత్తిదెబ్బ తగిలి విడిన
                ఆత్మలు ఘోషించు రాత్రి

పాండవ స్కంధావారం
విజయంతో గర్వించురాత్రి
పరివారం వెంటలేని
సుయోధనుడు మహారాజు
ఎవరికి కనిపించకుండా
తటాకమున దాగిన రాత్రి
గర్వంతల ఎత్తే రాత్రి
ఇది - గర్వంతల దించే రాత్రి.

పేజి. 40-41

సంజయుడు వచ్చాడు నగరానికి
తొలివేకువనె చేరాడు కథనానికి
శేష కౌరవసైన్య మెప్పుడొచ్చేనని
ఎదురుచూస్తున్నట్టి నగరానికి

యుద్ధకథ చెప్పాడు రాణిరాజులకు
శోకగాథను విన్న గాంధారి మాత

శిలవలె స్థాణువై చేతనము తప్పె.
లక్ష్మిలా శోభిల్లు గాంధారి ముఖమందు
అణుమాత్రమూ ప్రాణ మగుపించలేదు.
* * * * *
మధ్యాహ్నం వేళకి మాత్రం
నగరమంతటా కలకలము
విరిగిపోయి రథశకలాలు
దైన్యమూర్తులై బ్రాహ్మలు, స్త్రీలు
ప్రాణాపన్నులు, విధవలు, వైద్యులు
శక్తి హీనులతొ, క్షతగాత్రులతో
నగరమంతటా కలకలము.

పద్ధెనిమిది రోజుల కిందట
రంగుల రంగుల కేతనాలతో
కదం తొక్కుతూ గళం విప్పుతూ
భూమ్యాకాశాల్నేకం చేస్తూ
కదన భూమికై కదిలిన సేన
"ఇది ఆ సేనేనా?" అని కౌరవ నగరం
సందేహించగ శిథిలసేన వచ్చె
కౌరవ నగరానికి శిథిలసేన వచ్చె.

పేజి. 66, 67

అడుగో అడుగో శంకరుడు
ప్రళయ భయంకరుడు
అడుగో అడుగో శంకరుడు
విషపూరిత సర్పాలంకృతుడు
మహాప్రళయ జ్వాలా సంయుతుడు

స్కంధావారం ప్రక్కన చూసెను
నడయాడే అశ్వత్థామను
ప్రళయకాల గంభీర స్వరముతో
ప్రణవమూర్తి యిటు చెప్పెను:

“ముందునన్ను గెలిచిచూడు
అపుడే లోనికి పోగలవునీవు.”

అని నిలదీసిన శివునితో
అనిలో ఢీకొనె నశ్వత్థామ.
* * * * *
అస్త్రాలు శస్త్రాలూ
శరపరంపరలూ
తాను నేర్చిన విద్యలన్నింటినీ
వెంటవెంటనే శివునిమీదికి
ప్రయోగించె నశ్వత్థామ.

ప్రళయరుద్రుని ఒంటి
రోమరోమాలలో
చేరుకుని తలవంచె నస్త్రశస్త్రాలు.

ఓటమికి తలవంచి
అస్త్ర శస్త్రాలన్ని
రుద్రునికి ప్రణమిల్లు వేళ –

జటాకటాహ సంభ్రమన్నిపింప నిర్ఝరీసమా
విలోలవీచివల్లరీ విరాజమాన మూర్ధనీ
ధగద్ధగద్ధగ జ్వాల ల్లలాట పట్ట పావకే
కిశోర చంద్ర శేఖరే రతిప్రతిక్షణం మమ॥

అపుడశుతోషుడు అశ్వత్థామను చూసి –

నిశ్చయమ్ముగ విజయుడ వీవెసుమ్ము
పాండవుల పుణ్యమంతయు గడచి పోయె
కృష్ణదేవుని కోసమై కుంతి సుతుల
విజయులను చేసినది నేను వీరికెపుడు
క్రొత్త శక్తికి ఊపిరి పోసినాను

వారు ఈనాడు తలపెట్టినట్టి అధర్మ
యుద్ధ మేవారి మృత్యువునకు హేతువగును!!

పేజి. 77

కౌరవనగరిని నిర్జనమ్ముగా వదిలి
ఇళ్ళను, ముంగిళ్ళను, వీధులనూ వదిలి
యుద్ధహేతువైన సింహాసనమును వదిలి
కదిలిరి హస్తినవాసులు

దుర్యోధన చక్రవర్తి స్వర్ణమందిరమ్ము నేడు
పశువుల స్వేచ్ఛాసంచార గృహమ్ము.
* * * * *
కౌరవ నగరిని వదిలి
తమ నూర్గురు పుత్రుల
తర్పణాలు వదిలేందుకు
కదిలిరి మహారాజుమహారాణి
కదిలిరి కౌరవజనమంతా.

భర్తృహీనలై కౌరవపత్నులు
ముందు రథంలో రోదించగా
మిగిలిన కౌరవ సేనంతా
తలవంచుకు నడుస్తోంది.
ధృతరాష్ట్రుడు సంజయుడు
గాంధారీ విదుర యుయుత్సులు
మృతకౌరవ వీరగణానికి
తర్పణాలు వదిలేందుకు
కదలి తరలి వెడుతున్నారు.

పేజి. 90

కృష్ణుడీ శాపాన్ని స్వీకరించినవేళ
నక్షత్ర కాంతులు మందగించాయి

నిర్జీవమై నిలిచె జాతి మర్యాద
ప్రాణావశిష్టమై నిలచె మర్యాద
కవుల కవితలు, ఛందో గమనం
కళాహీనమై పోయాయి.
మర్యాదకు వెలిగా, మర్యాదకు బలిగా
నిర్జీవాలయి పోయాయి.

ఆనోటా ఈ నోటా విన్నారీ సంగతి
శాపం సంగతి
గాయపడ్డ తల్లిమనసు
కోపం వెలికక్కిన సంగతి
భయవిహ్వలుడై ప్రతివాడూ
గజగజవణికేవాడే!
గాంధారీ మాతతో
ఇహ చెప్పేదెవరు?

అయినా ఈశాపం
యుగ సంధ్యను ఆవరించు
కలుషిత ఛాయల్లా
ప్రతిమనిషిని వెంటాడుతోంది
ప్రతిమనసును వెంటాడుతోంది.

పేజి. 91, 92

రోజులు వారాలు నెలలు
ఏళ్ళు పూళ్ళూ గడిచాయి.
రెండు బ్రహ్మాస్త్రాలకు
మాడిమసైపోయింది ధరణి.
కొన్నాళ్ళు గడిచాక, కొన్నేళ్ళు గడిచాక
రత్నమాణిక్యాలతో
ఆకుపచ్చని పావడాతో
అలరించుకుంది ధరణి.

ధర్మరాజు మహారాజు నేడు
అయినా కౌరవనగరం
పాడయిపోయిన పూలవనంలా
శోభాహీనంగా వుంది.

విజయంపొందిన వాళ్ళంతా
విశ్వాసం పోగొట్టుకున్నవాళ్ళు
సూత్రధారుడా కృష్ణుడు
అతడే శాపగ్రస్తుడు!
పుణ్యవంచిత పాండవ రాజ్యం
అస్తవ్యస్తం పాండవ రాజ్యం
గర్వం తలకెక్కిన భీముడు
మందబుద్ధి అల్పజ్ఞుడు
అకాల వృద్ధుడు అర్జునుడు
నకులుడేమో అజ్ఞాని
విరిసీవిరయని స్థితిలో సహదేవుడు
చింతలతో మునిగివున్న యుధిష్టిరుడి నుదుటిమీద
ఈ వికృత యుగ మాశించే భావిస్వప్నాల బరువు!

ఏమవుతుందో తెలిసినవాడొకడే
శాపగ్రస్తుడైన ప్రభువు.

పేజి. 92

మనమందరమూ కలిసి
రణభూమిలో నాటిన బీజం
అంకురించి విస్తరించి
సకలజ్ఞానాన్నే కప్పివేయు
పనికిరాని ఆలోచనలో
మునిగిపోయె యుధిష్టిరుడు
అంధకార భవితవ్యంలోనికి
శూన్యదృక్కులతొ చూస్తున్నాడు.

పేజి. 102

పాండవ పరిపాలన
ఇలా సాగుతోంది.
రోజురోజుకు
అస్థిరమతుడై
అలమటించె
యుధిష్ఠిరుడు.
పొందిన విజయం అంతా
వ్యర్థమ్మై తోస్తున్నది
అనునిత్యం అశాంతితో
అలమటించె యుధిష్ఠిరుడు
విశ్వాసం సన్నగిల్లి
ప్రతిక్షణం క్షోభించెను
మహారాజు యుధిష్ఠిరుడు.

పేజి. 106, 107

అది సాగర తీరం
ప్రభాస వన క్షేత్రం
ఉవ్వెత్తున పడిలేచే
కడలి తరంగాల హోరు
చెదురుతున్న కడలినురుగు
హోరుగాలి తాకిడికి
విరిగిపడే తాడిచెట్లు
అడవి తులసి వెదజల్లే
సుగంధాల సోయగాలు.

అతి పవిత్రమైన యట్టి
అశ్వత్థ వృక్షఛాయల
మౌనంగా శాంతంగా
కూర్చున్నాడు ప్రభువు.
నీలమేఘశ్యాముడు

నిశ్చలుడై కూర్చున్నాడు.
కొంచెం అలిసిన ఛాయలు
అలిసిన కనురెప్పలమాటున
అరమూసిన కన్నులు
విచ్చుకొనే కనులేమో
నీలి కలువ రేకలు.
ఆయన గళసీమన
అలరించే కమలమొకటి.
ఇంకా మిగిలున్నది
ఒక్క రేక మాత్రమ్మే.

పేజి. 107

రెండు రావి కొమ్మఆకుల మధ్య
బంగారపు కాంతులతో
ప్రభువునుదురు వెలుగొందు

తన కుడిపాదము మీద నుంచె నెడమపాదము
మృగముఖమై తోచెను ప్రభు పావనపాదము

ఎంత చిత్రమైనది యీ యుగమూ!
అంటూ నిట్టూర్చెను ప్రభువు!!

పేజి. 109

అల్లంత దూరాన
ముళ్ళ పొదలావెనక
పొంచివున్నా డొక్క
వేటగాడు.

ప్రభుపాదమే తాను
మృగముఖమ్ముగ కనగ
విల్లంబు చేత బట్టాడు

వేగంగ
విల్లునే ఎక్కుపెట్టాడు.
* * * * *
నక్షత్ర మండలం ఆరిపోయింది
వనమంత భయమంది వణికిపోయింది.
* * * * *
ప్రభుప్రస్థానం జరిగిన వేళ
ద్వాపరయుగం ముగిసింది.
కలియుగం అవతరించింది.

పేజి. 118

అవతరించెనంధయుగం ఆనాడే
అంతముకా దెన్నటికీ అంధయుగం.
ఎక్కడో ఒక చోట నిమిష నిమిషానికి
మరణిస్తు ఉన్నాడు ప్రభువు.
ప్రతినాట ప్రతిచోట వ్యాపిస్తు ఉన్నదీ
అంధయుగమూ, యుగప్రవృత్తీ.
అశ్వత్థామలు, సంజయులూ
ముసలి రక్షక భటులు సైతం
సంశయాత్ములు, సగం అంధులు.

సిగ్గుపడే ఆ పరాజయం
సంశయాల ఆ గుడ్డితనం
మనమనసుల నిపుడూ ఎపుడూ
వెంటాడుతునే ఉంటాయి.

(ఒక్క మాట మాత్రం నిజం
బీజరూపమైన మనసు చూపు
సాహసము, స్వతంత్రత, అధునాతన సృష్టి
ఈ విషయాల్లో తటస్థదృష్టి
అనాసక్త తత్వం.
అందుకే మన మనసులు

జీవిత నిర్వహణంలో
మర్యాదల ఆచరణంలో
నైతిక నియమాల్లో స్వేచ్ఛాగమనాల్లో
అర్థ సత్యాల నుంచి, బ్రహ్మాస్త్రాల భయం నుంచి
గుడ్డి సంశయాల నుంచి, దాస్యపరాజయాల నుంచి
మానవ భవితవ్యా న్నహరహమూ
రక్షిస్తూ ఉండుగాక!)

ఒక మాటమటుకు నిజము
బీజరూపమ్మయిన మనసున
దాగి ఉన్నది ఒక్క సత్యం.
సాహసంలో స్వతంత్రంలో
కొత్త సృష్టిని కోరడంలో
నిరాపేక్షత దాని తత్త్వం.
దాని సత్యం అదే అయినా
మనిషి జీవితగమన మందున
బాధ్యతా మర్యాద కూడిన
మనసు చూపే స్వేచ్ఛ ఒకటే.
అర్థసత్యం బారినుంచి
బ్రహ్మఅస్త్రం భయం నుంచి
ఓటమీ దాస్యాలనుంచి
మానవ భవిష్యత్తును
ఎపుడూ కాపాడుతూంటుంది.
నిత్యమూ రక్షిస్తు ఉంటుంది –

## <u>వందనం</u>

వందనమయ్యా వందనము
శబ్ద బ్రహ్మకూ వందనము
అర్థ బ్రహ్మకూ వందనము!!

అర్థభావ పరమార్థము నీవు
సర్వసృష్టి సమభావము నీవు

అహరహమూ నిను ఆశ్రయించియే
నడయాడును వాణి -
అనునిత్యం నీ ఆశీస్సులతో
చరియించును చదువులరాణి
ఎంత సార్థకము, ఎంత పవిత్రము
పలుకుల తల్లి జీవితమూ ॥వందనమయ్యా॥

స్వామీ! నీ లీలాగానంతో
పరవశమందేము మేము -
స్వామీ! నిర్మల హృదయంతో
నిను స్మరించేము మేము
మా ఒడిదుడుకుల విశ్వాసానికి
కోపగించుకోకు స్వామీ
నీ కారుణ్యం సమయించకు స్వామీ ॥వందనమయ్యా॥

ఎంతనిగూఢం, ఏమి రహస్యం
శ్రీహరి చరితం, ఎవరికి విదితం?
కరుణామయమూ, నిగూఢమూ
నీ అంతిమ నిష్క్రమణం
నీ ప్రస్థాన విధానం విరచించేందుకు
శబ్దసంపదను ప్రసాదించు స్వామీ!
ధ్వన్యలంకార రసభావ పుష్టిని
దయసేయుము స్వామీ ॥వందనమయ్యా॥

వందనం 2

శబ్ద బ్రహ్మవు నీవు ప్రభూ!
అర్థాలకు పరమార్థము నీవు
నీ ఆశ్రయాన ఉన్నవాణి
ఎపుడూ వ్యర్థం కాదు.
శబ్ద బ్రహ్మకు నీకిదె వందనం
నిర్మల హృదితో శతాబ్దాలుగా
నీ లీలాగానం చేసేవారికి వందనం॥

హరి రహస్యమయ జీవిత సత్త్వం
నా భావన కందని పరమార్థం –

కరుణాత్మకమూ, రహస్యమయమూ
నీ అంతిమ ప్రస్థానం చిత్రించేందుకు
శబ్ద సంపదను, రసానుభవమును
అలంకారములనివ్వు
శబ్ద బ్రహ్మవు నీవు, ప్రభూ!
అర్థాలకు పరమార్థము నీవు!!

## మంగళాచరణం

ఇది విష్ణుపురాణం వర్ణించిన యుగలక్షణ వైక్లబ్యం
భవితవ్యం చెబుతున్నది –

ధర్మాధర్మాలు రెండు
తిరోగమన పథం వైపు
పయనించక తప్పదని –

భవితవ్యం చెబుతున్నది
ధర నెమ్మదిగా క్షయిస్తుంది.

భవితవ్యం చెబుతున్నది
అర్థమున్నవాడిదింక అధికారమ్మని
కపటవేషధారులే నాయకులౌతారని –

శక్తియుక్తి హీనులైన రాజుల అధికారంలో
ప్రజలిబ్బందులపాలై
కొండగుహల్లో దాక్కొని
బిక్కు బిక్కు మంటూ తమ
జీవితాన్ని గడుపుతారు ॥

ఇది అంధయుగం
ప్రజాసంక్షోభయుగం ॥

ఇది అంధయుగం, అంధయుగం

కురు పాండవ సంగ్రామం
ప్రభవించిన అంధయుగం, సంక్షోభయుగం
అంధుల, పాషండుల సంగ్రామఫలం ॥ఇది అంధయుగం॥

ఈ ఉధృత సంఘర్షజనిత
జీవన సంక్షోభంలో
మానానికి విలువ లేదు
మర్యాదకు గణన లేదు
మానం మర్యాదలూ, నైతిక సూత్రాలూ
ఇరువైపుల చిక్కుకున్న తెగిపోయే సూత్రంలా
నలిగినలిగి పోతున్నది
చివికి చివికి పోతున్నది ॥ఇది అంధయుగం॥

ఈ చిక్కుముడిని విప్పేవాడొకడే – ఒకడే, ఒకడే
పరమాత్ముడు శ్రీకృష్ణుడు
భవితకు భద్రతనిచ్చే వాడొకడే – ఒకడే, ఒకడే
పరమాత్ముడు, శ్రీకృష్ణుడు

మిగిలిన వారంధులు, పదభ్రష్టులు
ఆత్మదృష్టి కోల్పోయిన అల్పులు
అంధకార గహ్వరాల లోలోపల దాగివున్న
విచలితులు, భయ విహ్వలులు.

ఇది అంధుల గాథ; ఇది అంధయుగం గాథ
అంధుల ద్వారా చెప్పే దివ్యజ్యోతిగాథ – ఇది దివ్య జ్యోతిగాథ – దివ్య జ్యోతి గాథ ॥ఇది అంధయుగం॥